భయంభయంగా ప్రయాణం!

ప్రమాదకరంగా భద్రాచలం- చర్ల ప్రధాన రహదారి

- అయినా పట్టింపులేని ఆర్‌అండ్‌బీ అధికారులు
- తరచుగా ప్రమాదాలు.. గాయపడుతున్న పలువురు

భద్రాచలం–చర్ల ప్రధాన రహదారిపై ప్రయాణించాలంటే వాహనదారులు, ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఈ ప్రధాన రహదారి గుండా నిత్యం వందలాది వాహనాలు నిత్యం ప్రయాణిస్తుంటాయి. దీనికి తోడు చర్ల, దుమ్ముగూడెం మండలాల నుంచి ఇసుక లారీలు అధిక లోడ్‌తో వెళ్తుండటంతో రహదారి మొత్తం గోతులమయాంగా మారి ప్రమాదకరంగా మారిన రహదారి అవస్థలపై కథనం.



నర్సాపురం ఇసుక ర్యాంపు దగ్గర రహదారిపై ఏర్పడ్డ గోతులు



తూరుబాక బ్రిడ్జి మలుపు దగ్గర..



ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో (ఫైల్)

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం నుంచి తూరుబాక వరకు ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై గోతులు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. గతేడాది వర్షాకాలంలో వచ్చిన గోదావరి వరదలకు ఈ ప్రాంతాంలోని రహదారి నీటిలో కొన్ని రోజుల పాటు ఉండటంతో గోదావరి తీసిన అనంతరం రహదారి పైభాగం మొత్తం కొట్టుకునిపోయి గోతులు ఏర్పడ్డాయి. దీంతో ఈ రహదారిపై ప్రయాణించాలంటే ప్రజలు, వాహనదారులు భయాపడాల్సిన పరిస్థితి వచ్చింది. భద్రాచలం నుండి పర్ణశాల, చర్ల, వెంకటాపురం వరకు నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఈ గ్రామాల దగ్గరకు వచ్చే సరికి గోతులు రావడంతో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించలేక ఎదురెదురుగా ఢీ కొట్టుకుంటున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు పెద్దప్రమాదం జరిగి ప్రాణాలు పోయే వరకు పట్టించుకోరా అంటూ గ్రామస్తులు, ప్రజలు వాపోతున్నారు.

పలుచోట్ల ప్రమాదకరంగా గోతులు

భద్రాచలం–చర్ల ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదారిపై నర్సాపురం నుండి తూరుబాక బ్రిడ్జి వరకు పలు ప్రదేశాల్లో రహదారిపై గోతులు ఏర్పడి ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. నర్సాపురం ఇసుక ర్యాంపు దగ్గర నుంచి మందపాటి సుధాకర్‌రెడ్డి ఇంటి దగ్గర వరకు అలాగే తూరుబాక గ్రామ చివారు నుండి బ్రిడ్జి వరకు గోతుల మాయంగా మారింది. రాత్రి వేళల్లో ఈ రహదారిపై ప్రయాణించాలంటే ప్రజలు భయపడే పరిస్థితి వచ్చింది. రెండు రోజుల క్రితం లక్ష్మీనగరం నుండి భద్రాచలం వెళ్తున్న ఆటో, భద్రాచలం నుండి తూరుబాక వైపు వస్తున్న కారు తూరుబాక బ్రిడ్జి దగ్గర ఉన్న గోతులను తప్పించే క్రమంలో ఎదురెదురుగా ఢీ కోట్టుకోవడంతో ఆటో ఎగిరి రోడ్డు పక్కన పడింది. దీంతో ఆటోలోని ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలు అయిన సంగతి విదితమే. రోడ్డు గుంతలమయంగా మారి ప్రమాదకరంగా మారినప్పటికీ ఆర్‌అండ్‌బి శాఖ అధికారులు కనీసం మరమ్మతులు చేయించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి గోతులమయంగా మారిన రహదారికి మరమ్మతు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

వారంలోగా మరమ్మతు చేయిస్తాం..

తూరుబాక, నర్సాపురం రహదారిపై ఏర్పడిన గోతులను వారం రోజుల్లో మరమ్మత్తు చేయిస్తాం. ప్రస్తుతం భద్రాచలం పట్టణంలో పనులు నడుస్తున్నాయి. అవి పూర్తి కాగానే ఈ రహదారిపై కూడా గోతులు పూడ్చించడంతో పాటు ఇతర మరమ్మతులు చేయిస్తాం.

– హరిలాల్, ఆర్‌అండ్‌బీ డీఈ, భద్రాచలం

సమన్వయంతో అభివృద్ధికి కృషి



అశ్వాపురం: స్థలం పరిశీలిస్తున్న విప్ రేగా

మణుగూరుటౌన్: పెండింగ్‌లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తిచేసి, అధికారులు సమన్వయంతో అభివృద్ధికి కృషి చేయాలని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పథకాలపై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. స్థానిక సింగరేణి ఇల్లెందు క్లబ్‌లో ఏర్పాటు చేసిన అన్ని విభాగాల ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పినపాక నియోజకవర్గ అభివృద్ధి కోసం కేటాయించిన రూ.100 కోట్లు నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన విషయాలను అధికారులతో చర్చించారు. నియోజకవర్గంలోని తాగునీరు, రోడ్లు, సాగునీరు, అంతర్గత రోడ్లు, వివిధ గ్రామాలను కలుపుతూ ఏర్పాటు చేయనున్న రోడ్ల గురించి పూర్తిస్థాయిలో సమీక్షించారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలు పోశం నర్సింహారావు, కామిశెట్టి శ్రీలత, సూదిరెడ్డి సులక్షణ, ఎంపీపీలు గుమ్మడి గాంధీ, కారం విజయకుమారి, కొంద్రు మంజు భార్గవి, అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. కేసీఆర్ సహాయంతో నియోజకవర్గాన్ని ప్రథమస్థానంలో నిలుపుతామన్నారు.

నాణ్యమైన ఉచిత విద్య అందించడమే లక్ష్యం..

అశ్వాపురం: అన్ని వర్గాల వారికి నాణ్యమైన ఉచిత విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో పాలిటెక్నిక్ కళాశాల, బీసీ గురుకులం (బాలుర, బాలికల), ఎస్సీ గురుకులం, ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాలల ఏర్పాటుకు అధికారులతో కలిసి అనువైన స్థలాలను పరిశీలించారు. అదేవిధంగా మిట్టగూడెం తరలించి తరగతులు ప్రారంభించిన ప్రభుత్వ బాలుర గురుకుల డిగ్రీ కళాశాను సందర్శించారు. ఈ కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్ స్వప్నకుమారి, జెడ్పీటీసీ సూదిరెడ్డి సులక్షణ, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గజ్జల లక్ష్మారెడ్డి, తహసీల్దార్ ఎం.ఏ.రాజు, ఆర్‌ఐ రాజేశ్వరరావు, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కోడి అమరేందర్, కందుల కృష్ణార్జున్‌రావు, దైదా నారాయణరెడ్డి, యువజన అధ్యక్షుడు రామకృష్ణ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

‘దళితబంధు’ను సద్వినియోగం చేసుకోవాలి



యూనిట్ అందజేస్తున్న ఎమ్మెల్యే వీరయ్య

భద్రాచలంటౌన్: దళితబంధు యూనిట్ పొందిన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య అన్నారు. దళితబంధు పథకం లబ్ధిదారుడు కోట రవికుమార్‌కు మినీ హోటల్ యూనిట్‌కి సంబంధించిన ఆటోట్రాలీని ఆయన మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...దళితబంధు యూనిట్‌ని సక్రమంగా వినియోగించికుని అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ బొగ్గుల నాగలక్ష్మి, శ్రీనివాస్, సతీష్, వెంకటేష్, సుధీర్, ప్రదీప్, రాము, వీరాస్వామి, రవికుమార్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో జాతర పర్యవేక్షణ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటేష్

అశ్వారావుపేటరూరల్: జాతర ఉత్సవాలను నిరంతరం సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించి, శాంతిభద్రతలకు ఇబ్బందులు రాకుండా చూడాలని డీఎస్పీ వెంకటేష్ అధికారులు, పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. మండల పరిధిలోని వినాయకపురం గ్రామ సమీపంలోగల శ్రీ చిలకలగండీ ముత్యాలమ్మ ఆలయం వద్ద ఈ నెల 19 నుంచి జరిగే జాతర ఉత్సవాల ఏర్పాట్లను మంగళవారం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. తెలంగాణ, ఏపీ సరిహద్దులో ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఆలయానికి ఏటా జాతర ఉత్సవాల సందర్భంగా భక్తుల రద్దీ ఉంటుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని భక్తులకు, ట్రాఫిక్‌కు ఏలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ బాలకృష్ణ, ఎస్సై రాజేశ్ కుమార్, బిర్రం వెంకటేశ్వరరావు, లోకం సాంబశివరావు, ఉప్పల నాగమహేశ్వరరావు, తమ్మిశెట్టి శ్రీను, పాల్గొన్నారు.

ఆటో కార్మికులపై వేధింపులు ఆపాలి



మాట్లాడుతున్న సాబీర్‌పాషా

చండ్రుగొండ : ఆటో కార్మికులకు ప్రభుత్వం వేధింపులు ఆపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా డిమాండ్ చేశారు. మండలకేంద్రం చండ్రుగొండలో ఏఐటీయూసీ అనుబంధ ఆటోవర్కర్స్ యూనియన్ మండల మహాసభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటోవర్కర్లు పెద్ద ఎత్తున ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రవాణశాఖాధికారులు, పోలీసులు ఆటోవాలాలపై పన్నుల రూపేణ ఆర్థిక వేధింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఏఐటీయుసీ కార్మికులకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ నెల 18న, కొత్తగూడెంలోని ఆర్టీఓ కార్యాలయం ముట్టడి ఆందోళనను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గార్లపాటి రామనాథం, జడ శ్రీను, బొర్రా కేశవులు, ఎండి.జహీర్‌హుసేన్, గొంద్యాల రాధాకృష్ణ, ఉమా, పిచ్చయ్య, నాబీద్, షారీజ్, సుధాకర్, నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రజాపంథా పార్టీలో చేరిక

మణుగూరు రూరల్: సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీలో పలువురు పార్టీ జిల్లా నాయకులు ఆర్ మధుసూధన్‌రెడ్డి సమక్షంలో మంగళవారం చేరారు. వీరికి ఆయన పార్టీ కండువాలు కప్పి సాధరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండి.గౌస్, మల్సూర్, కొండారెడ్డి, జీవన్, లక్ష్మీనర్సు, భిక్షం, లక్ష్మయ్య, బుచ్చిరాములు, జానయ్య, విజయ్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై మధుప్రసాద్

భద్రాచలంటౌన్: ప్లాస్టిక్ వాడకాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించుకోవాలని భద్రాచలం పట్టణ ఎస్సై మధు ప్రసాద్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్‌డీ భద్రాద్రి కొత్తగూడెం శాఖ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో ప్లాస్టిక్ రీసైక్లింగ్ అనే అంశంపై మంగళవారం విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ప్రిన్సిపాల్ భద్రయ్య, సాయి లక్ష్మణ్, శ్రీకాంత్, లోకేష్, బాలాజీ, వాసవి ఉషా, నిఖిల్, సాయికిషోర్ పాల్గొన్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

చర్ల: ఇంటర్మీడియట్ పరీక్షల్లో అవకతవకలు చోటు చేసుకోకుండా పకడ్బందీగా నిర్వహించాలని పీడీఎస్‌యూ మండల నాయకులు మునిగెల శివప్రశాంత్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్నీ సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో రేగా మాలవిక, పొడియం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కారల్ మార్క్స్ స్ఫూర్తితో ఉద్యమించాలి..

దుమ్ముగూడెం: పెట్టుబడిదారుల గుండెల్లో రైళ్లను పరిగెత్తించిన కారల్ మార్క్స్ స్ఫూర్తితో ప్రతీ ఒక్కరు సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వరు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలో ములకపాడులో గల వైయస్ భవన్‌లో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ అధ్యక్షతన మార్క్స్ వర్ధంతి సందర్భంగా మార్క్స్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. పిట్టల రవి, కె.బ్రహ్మాచారి, మండల కార్యదర్శి పుల్లయ్య, రమేష్, మర్మం చంద్రయ్య, చిలకమ్మ, యలమంచి శ్రీను బాబు, బోల్లి సత్యనారాయణ, సాంబశివరావు, చిను, సున్నం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బీఎస్పీ కరపత్రాల పంపిణీ

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని ఆసుపాక గ్రామంలో సోమవారం బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మడకం ప్రసాద్ దొర ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి పార్టీ విధి విధానాలు, హామీలు, పార్టీ ఎన్నికల గుర్తు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘం దుర్గారావు, గొల్లమండల పెంటయ్య, పింగళి రాము, బోడపాటి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సమ్మెతో పేరుకుపోయిన చెత్త..





పట్టణంలో కుప్పలుగా పడిఉన్న చెత్త

మణుగూరుటౌన్: మణుగూరు మున్సిపల్ కార్మికులు వేతనాలు చెల్లించాలంటూ రెండు రోజులుగా సమ్మె చేస్తున్నారు. మంగళవారం కార్మికులు సమ్మె కొనసాగించారు. సమ్మె కారణంగా పట్టణంలో చెత్తా చెదారం పేరుకుపోయాయి. అధికారులు చొరవ తీసుకొని కార్మికుల సమ్మెకు పరిష్కారం చూపించాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని కార్మికులు కోరుతున్నారు.

వర్క్‌షాప్‌లతో విజ్ఞానం



నమూనాలను వివరిస్తున్న విద్యార్థులు

భద్రాచలం: పాఠశాలల్లో నిర్వహించే సైన్స్ తదితర వర్క్‌షాప్‌లు విద్యార్థుల విజ్ఞానాన్ని పెంచడానికి దోహదం చేస్తాయని రూపా స్కూల్ కరస్పాండెంట్ మునికేశవ్, ప్రిన్సిపాల్ మహాలక్ష్మీలు అన్నారు. మంగళవారం రూపా పాఠశాలలో జరిగిన ‘స్టూడెంట్ వర్క్‌షాప్’ను వారు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టు నమూనాలు ఆకట్టుకున్నాయి. ఇన్‌చార్జ్ బాబురావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

మణుగూరుటౌన్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడాల్లో రాణించాలని మణుగూరు డీఎస్పీ ఎస్.రాఘవేందర్‌రావు అన్నారు. మంగళవారం మణుగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆయన వాలీబాల్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోను ఆసక్తి చూపాలన్నారు. సీఐ ముత్యం రమేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

దుమ్ముగూడెం: మండలంలోని తూరుబాక గ్రామంలో విద్యుత్ వినియోగదారుల సమస్య పరిష్కార వేదికను సీజీఆర్ఎఫ్–1 చైర్ పర్సన్ పి. సత్యనారాయణ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తురుబాక పంచాయతీలో సర్పంచ్ భూక్యా చందు నాయక్ వారి పంచాయతీలో పలు సమస్యలు లిఖితపూర్వకంగా అధికారులకు అందజేశారు. అధికారులు తిరుమలరావు, ఆర్.చరణ్ దాసు, నరేంద్ర కుమార్, ఏఈ ఎం.రాములు నాయక్, ఏడీఈ టీ.వేణు, ఏఈలు, సబ్ ఇంజనీర్లు, అకౌంట్ ఆఫీసర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ములకలపల్లి: మండలపరిధిలోని పాగళ్లపల్లి హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. మంగళవారం పాఠశాలలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు చేతుల మీదగా పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు.

18న బీఎస్పీ కార్యాలయ ప్రారంభం

మణుగూరు రూరల్ : మణుగూరు మండల కేంద్రంలోని అశోక్‌నగర్ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన బీఎస్పీ పినపాక నియోజకవర్గ కార్యాలయాన్ని ఈ నెల 18న ప్రారంభించనున్నట్లు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అల్లెం కోటి తెలిపారు. మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ నల్లగట్ల రఘు, నియోజకవర్గ అధ్యక్షుడు ఇర్ప రవి, వెంకటేశ్వర్లు, పీక మల్లేష్, బూర్గుల కరుణాకర్ , శివ, సైదులు, కృష్ణ, కుమార్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

దుమ్ముగూడెం: పాఠశాల స్థాయిలో విద్యాభ్యసన సమయంలో విద్యార్థులకు క్రీడలు మానసికొల్లాసానికి సంపూర్ణ వికాసానికి ఎంతో దోహద పడతాయని దుమ్ముగూడెం సీఐ దోమల రమేష్ అన్నారు. మంగళవారం మండలంలోని బండారుగూడెం మండల పరిషత్ పాఠశాల ఆవరణలో క్రీడా మైదానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే క్రీడా పోటీల్లో పాల్గొనడంతో దేహధారుడ్యం మెరుగుపడి శక్తివంతులుగా మారుతారని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కాంతారావు, సర్పంచ్ కాటిబోయిన చిన్న వెంకటేశ్వర్లు, విద్యా కమిటీ చైర్మన్ కుంజా నాగేశ్వరరావు, ప్రధాన ఉపాధ్యాయులు బెక్కంటి శ్రీనివాసరావు, ఎమ్మెస్ కెప్రతినిధులు వెంకట్, ఉపాధ్యాయులు ఏవి సీతారాం, వంశీ మోహన్, సరోజినీ, రవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కేసులు ఎత్తివేయాలి

చండ్రుగొండ: పోడుదారులపై బనాయించిన అక్రమకేసులు వెంటనే ఎత్తివేయాలని అఖిలభారత రైతుకూలీ సంఘం రాష్ట్ర నాయకులు ఎస్‌కె.ఉమర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలకేంద్రం చండ్రుగొండలో మంగళవారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంకట్రావ్, తోలెం వెంకటేశ్వర్లు, బాలు, కిషన్, భీముడు, భద్రు, రమేష్, మన్ను, వెంకట్రావ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్

చండ్రుగొండ: ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి స్కాలర్‌షిప్‌లకు ఎంపికైన విద్యార్థులను మంగళవారం ఉపాధ్యాయులు అభినందించారు. మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పి.సతీష్, ఎస్‌కె.తహసీన్, సీహెచ్ శ్రావ్యలు రూ.12 వేలు స్కాలర్ షిప్‌నకు అర్హత పొందారు. ఉపాధ్యాయులు ఆనంద్ కుమార్, మంజుశ్రీ, ఆదిలక్ష్మి, హోషం, స్వరూప, వాజీద్, కృష్ణ, రాములు, లక్ష్మణ్, పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల ఏర్పాట్లు పూర్తి



బూర్గంపాడు: పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ నాగరాజు, ఎస్సై సంతోష్



గుండాల: హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న అధ్యాపకులు



మణుగూరుటౌన్: పరీక్ష ఏర్పాట్లు తెలుసుకుంటున్న డీఎస్పీ రాఘవేందర్‌రావు



దుమ్ముగూడెంలో..

బూర్గంపాడు: నేటి నుంచి జరగనున్న ఇంటర్ పరీక్షల ఏర్పాట్లను అధికారులు మంగళవారం పరిశీలించారు. బూర్గంపాడు మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, సీఐ నాగరాజు, ఎస్సై సంతోష్‌లు పరిశీలించారు. ఫస్ట్ ఇయర్ విద్యార్థులు 292, సెకండియర్ విద్యార్థులు 261మంది హాజరుకానున్నట్లు ప్రిన్సిపాల్ జీ.చిన్యా తెలిపారు.

గుండాల: మండలంలో గురుకుల కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదటి ఇంటర్‌లో మొత్తం 436 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నవీన జ్యోతి అన్నారు.

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్, చీఫ్ సూపరిండెంట్ ఎల్. వెంకటేశ్వర్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ గరుడాచలం. స్థానిక మండల రెవెన్యూ అధికారి చంద్రశేఖర్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 282, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 217 మొత్తం 499 మంది హాజరవుతారని తెలిపారు

మణుగూరుటౌన్: మండలంలో కృష్ణవేణి జూనియర్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలను పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేసినట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ పద్మావతి తెలిపారు. కృష్ణవేణి కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 205మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 310 మంది హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ మేరకు పరీక్షా కేంద్రాలను డీఎస్పీ రాఘవేందర్‌రావు పర్యవేక్షించారు.

క్లుప్తంగా

సబ్‌స్టేషన్ ఏర్పాటుకు నిధులు

ములకలపల్లి: మండలపరిధిలోని మంగలిగుట్ట గ్రామంలో నూతన సబ్‌స్టేషన్ ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయి.ఇటీవల మండలాన్ని సందర్శించిన మాజీ మంత్రి, జేవీఆర్ ట్రస్ట్ బాధ్యులు జలగం ప్రసాదరావుకు స్థానిక రైతులు ఓల్టేజీతో ఎదుర్కొంటున్న ఇబ్బందులను విన్నవించారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సహకారంతో సమస్యలను విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులకు నివేదించారు. ఈ క్రమంలో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు 2.93 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తూ, ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది.

రేపు సర్వసభ్య సమావేశం

దుమ్ముగూడెం: మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం ఎంపీపీ రేసు లక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రమౌళి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ రమేష్

మణుగూరు రూరల్: స్థానిక సురక్షాబస్టాండ్ ప్రాంగణంలో మణుగూరు కుమ్మర సంఘం ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని సీఐ ముత్యం రమేష్, డిపో మేనేజర్ టి.స్వామి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో ప్రయాణికులు, బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సంఘం నాయకులు తిగుళ్ల శ్రీను, నిమ్మనగోటి వీరయ్య, దామర కుమార్ స్వామి, ఆర్టీసీ కంట్రోలర్ రాంబాబు, కండక్టర్ ఉపేంద్రరావుతో పాటు కె.వెంకటేశ్వర్లు, జి.బాలకృష్ణ, పీ.వీ.రెడ్డి, సైదులు, లక్ష్మణ్, సంజయ్, శివకృష్ణ పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీలో చేరిక

ములకలపల్లి: మండలంలోని సీతారాంపురం గ్రామ పంచాయతీకి చెందిన 50 కుటుంబాలు మంగళవారం వైఎస్సార్‌టీపీలో చేరారు. వీరికి పార్టీ మండలాధ్యక్షుడు కందుకూరి రాంబాబు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సోయం కృష్ణ, యువజన విభాగం మండలాధ్యక్షుడు రమణ, నాగేశ్వరరావు, సుధాకర్, అఫ్సర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడి మృతిపై సంతాపం

మణుగూరు రూరల్: బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు డేగల రమణరావు అనారోగ్యంతో బాధపడుతూ భద్రాచలం మండలం రాజుపేట కాలనీలోని తన సోదరుడు ఇంట్లో మంగళవారం మృతి చెందారు. ఈ మేరకు ఎంపీపీ కారం విజయకుమారి, ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు ముత్యం బాబు తదితరులు ఆయన మృతదేహం నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు మడి వీరన్న బాబు, బర్ల సురేష్, జావీద్‌పాషా, రమాదేవి, ఉపేంద్ర, బీరమ్మ శ్రీలత పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మణుగూరు రూరల్: మణుగూరు మున్సిపాలిటీ పరిధి విఠల్‌రావునగర్‌కు చెందిన జల్లా విజయకు రూ.20వేలు, కాంట్ల వెంకటరమణకు రూ.26వేల చొప్పున మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ జెడ్పీటీసీ పోశం నరసింహారావు మంగళవారం అందజేశారు. పీఏసీఎస్ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడపా అప్పారావు, బి.నవీన్‌తో పాటు రుద్ర వెంకట్, గుర్రం సృజన్, కట్ట రాజ్‌కుమార్, వేముల లక్ష్మయ్య, చెలికాని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

ములకలపల్లి: సెర్ప్ అధికారుల నిర్లక్ష్యంతో వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్న వీఓఏల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నరాటి ప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం ఆధ్వర్యంలో ఏపీఎం రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వీఓఏ షఫియా. విజయ, జానకీ, రమాదేవి పాల్గొన్నారు.

ఆర్థికసాయం

ములకలపల్లి: అనారోగ్యంతో మృతిచెందిన పంచాయతీ కార్మికుడు గుగులోతు లస్కర్ కుటుంబాన్ని సర్పంచ్ సున్నం సుశీల మంగళవారం పరామర్శించి పంచాయతీకి చెందిన రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఎంపీఓ లక్ష్మయ్య, ఉపసర్పంచ్ రమేశ్ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ములకలపల్లి: సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశపరీక్షకు గురువారంలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సునీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.